సాక్షి
కామారెడ్డి
బుధవారం । 31 । మే । 2023



మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ

మహిళల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్ పేర్కొన్నారు.

- 8లో ▸



రోడ్డెక్కిన అన్నదాతలు

తమ ధాన్యాన్ని రైస్‌మిల్ నిర్వాహకులు తీసుకోవట్లేదని పేర్కొంటూ మాచారెడ్డిలో రైతులు రోడ్డుపై ధర్నా చేశారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 41.5 /30.0

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. వడగాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతం కావచ్చు. సాయంత్రానికి వాతావరణం చల్లబడుతుంది.

కుల సంఘాలు యాక్టివ్!

ఎన్నికల ఏడాది కావడంతో రాజకీయ పార్టీలు కుల సంఘాలపై దృష్టి సారించాయి. కుల సంఘాలకు భవనాలు కట్టించడానికి, కుల దేవతల ఆలయాల నిర్మాణాలకు నిధులు ఇవ్వడం ద్వారా వారి నుంచి మద్దతు పొందేందుకు ప్రయత్నిస్తున్నాయి. వాళ్ల అవసరం కోసం తమ దగ్గరకు వస్తుండడంతో కుల సంఘాలు కూడా యాక్టివ్ అవుతున్నాయి.



వాళ్లకు అవసరం.. వీళ్లకు అవకాశం..

ఎన్నికల ఏడాది కావడంతో రాజకీయ పార్టీలకు కులాల వారీగా మద్దతు కూడగట్టుకునే అవసరం ఉండడం, దీన్ని ఆయా కుల సంఘాల నేతలు అవకాశంగా తీసుకుంటున్నారు. ప్రతీ సారి ఎన్నికల సమయంలో ఈ తంతు నడుస్తోంది. అయితే ఈ సారి ముందస్తుగానే రాజకీయ పార్టీలు అప్రమత్తమయ్యాయి. ముందే వారిని మచ్చిక చేసుకునేందుకు మూడు ప్రధాన పార్టీల నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఆయా సంఘాల నేతలు మాత్రం ఏ పార్టీ వాళ్లు పిలిచినా వెళ్లాలని, వీలైనంత ఎక్కువ డబ్బు లు వసూలు చేసుకోవాలనే ధోరణితో ఆయా పార్టీల నేతల ఇళ్లకు వెళుతున్నారు. అవకాశాన్ని వదులుకోకుండా ఎంత వీలైతే అంత ఎక్కువ డబ్బులు జమ చేసుకుంటున్నారు. కుల సంఘ భవనాలను నిర్మాణంతో పాటు ఆలయాల ను నిర్మించుకోవడానికి డబ్బులు వినియోగించుకుంటారు.

- ఎన్నికల ఏడాది కావడంతో గుర్తింపు కోసం ఆరాటం
- అప్పుడే ఆఫర్లు ఇస్తున్న రాజకీయ పార్టీలు
- మచ్చిక చేసుకునేందుకు రంగంలోకి దిగిన లీడర్లు
- సంఘ భవనాలు, ఆలయాల నిర్మాణాలకు నిధులు

సాక్షి, కామారెడ్డి : కులసంఘాల సభ్యులు ఏ పార్టీ వాళ్లు పిలిచినా సరే అందరూ మూటగట్టుకుని వెళ్తున్నారు. ఆలయ అభివృద్ధి, ఆలయ నిర్మాణం, కుల సంఘ భవనాలు, ఫంక్షన్ హాళ్ల నిర్మాణాలకు సాయం కోరుతున్నారు. దీంతో ఆయా పార్టీల నేతలు అడిగిన వారిని కాదనకుండా ఎంతో కొంత ఇస్తామని మాట ఇచ్చేస్తున్నారు. మరికొందరు ముందుగానే డబ్బులు ఇస్తున్నారు. అధికార పార్టీ నేతలు ప్రభుత్వం నుంచి కమ్యూనిటీ భవనాల నిర్మాణాలకు ప్రత్యేక నిధులు మంజూరు చేయించి కులాల వారీగా కేటాయిస్తున్నారు. ఇతర పార్టీలు మాత్రం ఇప్పటికిప్పుడు కొంత డబ్బు సంఘాల ప్రతినిధుల చేతుల్లో పెడుతున్నారు. మరింత డబ్బు సమకూరుస్తామని భరోసా ఇస్తున్నారు. ఒకరిద్దరు ప్రతినిధులైతే సొంతంగా గుడులు నిర్మించి ఇస్తున్నారు. జిల్లాలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజక వర్గాలు ఉండగా కామారెడ్డి నియోజక వర్గంలో ముందస్తుగా కుల సంఘాలను మచ్చిక చేసుకునేందుకు మూడు ప్రధాన పార్టీలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. దీంతో కుల సంఘాల నాయకులు యాక్టివయ్యారు. తమ ఊళ్లో తమ కుటుంబాలు, ఓటర్ల సంఖ్యను చూపెడుతూ ఎక్కువ మొత్తంలో సాయం తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

భవనాలు, దేవాలయాల నిర్మాణాలు..

ఊరూరా దాదాపు అన్ని కులాలకు సంఘాలు ఉన్నాయి. కొన్ని కులాల్లో సంఘాలు యాక్టివ్‌గా ఉండగా, కొన్ని కులాల్లో సంఘాలు ఎన్నికల సమయంలో మాత్రమే యాక్టివ్ అవుతాయి. ఆయా కులాల్లో ప్రధాన పార్టీలకు సంబంధించి కార్యకర్తలు, నాయకులు ఉన్నారు. గ్రామ, మండల స్థాయితో పాటు జిల్లా స్థాయి నాయకులు కూడా ఉంటారు. అయితే ఇప్పటికే చాలా గ్రామాల్లో కులాల వారీగా సంఘ భవనాలు నిర్మించుకున్నారు. ఇంకా కొన్ని చోట్ల భవనాలు నిర్మించుకోవలసి ఉంది. భవనాలు ఉన్న చోట భవనాలను విస్తరించడం, పైఅంతస్తులు వేయడం వంటివి చేస్తుంటారు. అలాగే ఆయా కు లాలకు కుల దేవతల ఆలయాలు కూడా ఉన్నాయి. ఇప్పటికే ఆలయాలు ఉన్న చోట ప్రహరీ నిర్మాణం, కమ్యూనిటీ భవనం, ఇతర సౌకర్యాలు కల్పించుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. కుల దేవతలకు ఆలయాలు లేని చోట కొత్తగా ఆలయాలు నిర్మించుకునే ప్రయత్నం చేస్తారు. దాదాపు అన్ని కుల సంఘాలు యాక్టివయ్యాయి. ఈసారి ఎన్నికల్లో ఎలాగైనా మూడు ప్రధాన పార్టీల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు సమకూర్చుకునేందుకు రెడీ అయ్యాయి. ఇప్పటికే కొందరు రాజకీయ పార్టీల నేతలు కుల సంఘాల నేతలతో మాట్లాడి వారి కోరికల చిట్టా తీసుకున్నారు. ఇంటికొకరు కలిసి వస్తే ముఖ్య నాయకుల వద్దకు తీసుకువెళ్లి సాయం చేయిస్తామని గ్రామ, మండల స్థాయి నాయకులు వారికి వివరిస్తున్నారు.

దీంతో ఇంటికొకరు జమై నేతల వద్దకు వెళ్తున్నారు. భవనం, ఆలయాల నిర్మాణానికి సాయం చేయమని కోరడం, సదరు నాయకుడు ఇప్పుడు ఎంత సాయం చేస్తాడో చెప్పి ఇచ్చి పంపడం, మిగితా సొమ్ము ఎన్నికల సమయంలోనో, గెలిచిన తరువాతనో ఇస్తామని భరోసా ఇస్తున్నారు. కామారెడ్డి నియోజక వర్గంలో ఓ పార్టీ నాయకుడు ఆలయాల నిర్మాణం, మరమ్మతులు, పునర్నిర్మాణం తదితర పనులకు ఎంత ఖర్చయినా తనే పెట్టుకుంటానంటూ మేస్త్రీలను, సామగ్రిని పంపించి పనులు చేపడుతున్నాడు.

న్యూస్‌రీల్

పేదల కోసమే డబుల్ బెడ్‌రూం ఇళ్లు



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : పేదల కోసమే డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మిస్తున్నామని, వారికే ఇస్తామని, తనను చంపినా ఉన్నోళ్లకు డబుల్ ఇళ్లు ఇవ్వనని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దుర్కిలో మంగళవారం పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఎస్సీ కాలనీలో రూ.20లక్షలతో అంబేడ్కర్ భవనం, రూ. 7 లక్షలతో రజక భవనానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎస్సీవాడలో ప్రజలతో మాట్లాడిన ఆయన గ్రామానికి ఇప్పటి దాకా డబుల్ ఇళ్లను కలిసి సుమారు రూ. 9 కోట్ల అభివృద్ధి నిధులు ఇచ్చామన్నారు. ఇప్పటివరకు సొంత స్థలాల్లో నిర్మించుకున్న డబుల్ ఇళ్లకు మరో వారంరోజుల్లో బిల్లులు వచ్చేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాల్త్య విఠల్, బీఆర్‌ఎస్ నియోజక వర్గ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి, సర్పంచ్ శ్యామల, ఎంపీటీసీ నారాయణ, నాయకులు ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్, కిషోర్, మహేశ్, నారాగౌడ్, శంకర్, మోహన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

నిజామాబాద్ సిటీ: ఉమ్మడి జిల్లాలోని దేవాలయాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు దేవాదాయశాఖ తరఫున రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాదాయ శాఖ సహాయక కమిషనర్ సుప్రియ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జూన్ 2న అన్ని ఆలయాలను అలంకరించడంతో పాటు సాయంత్రం ప్రమీదలతో దీపాలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే జూన్ 21, 22 తేదీల్లో తెలంగాణ ఆధ్యాత్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, వేద పారాయణ, భక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథలు, పురాణ ప్రవచన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సహాయక కమిషనర్ తెలిపారు.

రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



దోమకొండ : సీఎం కప్ అర్చరీ రాష్ట్రస్థాయి పోటీల్లో దోమకొండ క్రీడాకారులు పతకాలు సాధించినట్లు అర్చరీ కోచ్ ప్రతాప్‌దాస్ మంగళవారం తెలిపారు. దోమకొండకు చెందిన కదిరె సింధూజ బంగారు పతకం సాధించగా, నిఖిత వెండి పతకం సాధించినట్లు ఆయన వివరించారు. హైదరాబాద్‌లోని గచ్చీబౌలి స్టేడియంలో జరిగిన పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొన్న వీరు పతకాలు సాధించినట్లు ఆయన వివరించారు.

కాంగ్రెస్ గల్ఫ్ ఎన్‌ఆర్‌ఐ సెల్ కన్వీనర్‌గా సుధాకర్‌రెడ్డి



కామారెడ్డి టౌన్/భిక్కనూరు : కాంగ్రెస్ గల్ఫ్ ఎన్‌ఆర్‌ఐ సెల్ నూతన కన్వీనర్‌గా అంతంపల్లి సుధాకర్‌రెడ్డి నియమించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియామక పత్రాన్ని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ విదేశాల్లో ఉన్న భారతీయ కార్మికుల సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. గల్ఫ్ వలస కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు ఉన్నారు.

1,764 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో మంగళవారం నిర్వహించిన కంటి వెలుగు శిబిరాల్లో 1,764 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 226 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 4,46,613 మందికి కంటి పరీక్షలు చేయగా.. 65,485 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఇప్పటి వరకు జిల్లాలో 96.39 శాతం లక్ష్యం పూర్తయింది.

9న గొర్రెల పంపిణీ

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి టౌన్ : జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో జూన్ 9న ఆరు యూనిట్ల చొప్పున గొర్రెలను పంపిణీ చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం రెండో విడత గొర్రెల పంపిణీపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గొర్రెలను కొనుగోలు చేసే అధికార బృందం మొబైల్ అప్లికేషన్ శిక్షణ పూర్తి చేశారని తెలిపారు. గొర్రెలు కొనుగోలు చేసే విధానాన్ని మొబైల్ యాప్ లో నమోదు చేసే విధానాన్ని తెలియజేశారు. జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి సింహారావ్ మాట్లాడారు. 350 దరఖాస్తులు అప్‌లోడ్ చేశామన్నారు. 120 మంది లబ్ధిదారులు వాటాదనాన్ని చెల్లించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు డాక్టర్ దేవేందర్, శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

రైతులను సతాయిస్తే చర్యలు



అదనపు కలెక్టర్‌తో మాట్లాడుతున్న రైతులు

మాచారెడ్డి : రైస్ మిల్లర్లు రైతులను సతాయిస్తే చర్యలు తప్పవని కామారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రమోహన్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని ఫరీద్‌పేట గ్రామ శివారులోని రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి తెచ్చిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా కాంటా పెట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ నర్సింహారెడ్డి రైతులు పలు సమస్యలను అదనపు కలెక్టర్‌కు ఏకరువు పెట్టారు.

ఆ శాఖలో ఒకేఒక్కడు..!

- అస్తవ్యస్తంగా ఔషధ నియంత్రణ శాఖ
- అన్నీతానై పనిచేస్తున్న జిల్లా అధికారి
- అటెండర్ కూడా కరువు
- తీవ్ర పనిభారంతో ఇబ్బందులు
- కోర్టు కేసుల చుట్టూ తిరిగేందుకు కూడా సమయం సరిపోని వైనం..



కలెక్టరేట్‌లోని ఔషధ నియంత్రణ శాఖ కార్యాలయం

కామారెడ్డి టౌన్ : ఆ జిల్లా శాఖ కార్యాలయంలో ఆయన ఒకేఒక్క అధికారి. అన్ని పనులు తానే చేసుకోవాల్సి వస్తుంది. చివరికి అటెండర్ పని కూడా ఆ జిల్లా అధికారే చేసుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఆ శాఖలో ఉద్యోగులు, అటెండర్ అన్ని పోస్టులు ఖాళీలుగానే ఉన్నాయి. దీంతో ఉన్న ఒక్క అధికారిపై తీవ్ర పనిభారం పడుతోంది. అదే జిల్లా ఔషధ నియంత్రణ విభాగం. ఆ శాఖలో ఉన్నది ఒకే ఒక డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి. ఈ సందర్భంగా శాఖలో ఇబ్బందులు, పనుల పెండింగ్‌పై కథనం.

30కి పైగా కోర్టు కేసులు..

ఔషధ నియంత్రణ శాఖకు సంబంధించి జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ కోర్టులతో పాటు హైకోర్టులో మొత్తం 30కి పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. కేసుల వాయిదా వచ్చినప్పుడల్లా తప్పకుండా హాజరు కావాల్సి వస్తుంది. లేకుంటే కోర్టు ధిక్కరణ కేసుకింద మొట్టికాయలు పడుతాయి. కోర్టు చుట్టూ తిరగడంతో మిగితా పనులకు తీవ్రంగా అంతరాయం కలుగుతుంది.

450కి పైగా మెడికల్ షాప్‌లు..

జిల్లాలో సుమారు 450కి పైగా మెడికల్ దుకాణాలు, 70కి పైగా మెడికల్ ఏజెన్సీలున్నాయి. వీటన్నింటిని తరుచూ తనిఖీలు చేయాల్సి ఉంటుంది. రాజధాని తర్వాత మెడికల్ వ్యాపారం జిల్లాలో జోరుగా సాగుతుందని పేరుంది. అయితే జిల్లాలో మెడికల్ దుకాణాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వ నిషేధిత మందులను విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. తరుచూ మెడికల్ దుకాణాలు, ఏజెన్సీలను తనిఖీలు చేయాల్సి ఉంటుంది. అయితే శాఖకు ఒక్కరే విధుల్లో ఉన్న కారణంగా తనిఖీలు చేయడం కూడా కష్టంగా మారింది.

ఆఫీస్ తాళం కూడా..

కామారెడ్డి జిల్లా ఔషధ నియంత్రణ విభాగంలో సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు పోస్టులతో పాటు, అటెండర్ పోస్టులు మొత్తంగా మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వ వాహనం, డ్రైవర్ కూడా ఈ శాఖలో లేరు. ప్రస్తుతం జిల్లాకు ఒకేఒక డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి పని చేస్తున్నారు. అటెండర్ పని కూడా తానే చేసుకోవాల్సి వస్తుందన్నారు. గతంలో ఈ శాఖ ఆఫీస్ విద్యానగర్ కాలనీలో ఉండేది. రెణ్నెళ్ల క్రితం కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో ఆఫీస్ లో పార్టిషన్ చేసి ఓ గది కేటాయించారు. ఉదయం ఆఫీస్ తాళం కూడా జిల్లా అధికారే తీసుకోవాలి. ఒక్కోసారి టేబుల్స్ దుమ్ము దులపడం, గది ఊడ్వడం కూడా తానే చేసుకుంటున్నానని ఆయన వాపోయారు.

దేశం గర్వించేలా దశాబ్ది ఉత్సవాలు

- బాన్సువాడలో అధికారులు, ప్రజాప్రతినిధులతో స్పీకర్ పోచారం



మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, పక్కన కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి

బాన్సువాడ : దేశం గర్వించేలా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాన్సువాడలోని సరస్వతి మందిర్ ఫంక్షన్ హాల్‌లో జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నిర్ణయం మేరకు రాష్ట్ర దశాబ్ది అవతరణ ఉత్సవాలు జూన్ 2 నుంచి 22 వరకు పండుగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. జూన్ 2న జాతీయ జెండా ఆవిష్కరణ ఉంటుందని, జూన్ 3న రైతు దినోత్సవం రోజు రైతు వేదికలను అలంకరించాలని, లబ్ధిదారులతో మాట్లాడించాలన్నారు. ఎన్టీఆర్ ప్రారంభించిన సంక్షేమ రంగాన్ని కేసీఆర్ కొనసాగిస్తూ వారికి నిజమైన వారసుడు అనిపించుకుంటున్నాడన్నారు. రాష్ట్రంలో 2014లో 1.08 కోట్ల ఎకరాల సాగు భూ మి ఉంటే నేడు 2.18 కోట్ల ఎకరాలకు పెరిగిందని, 2014లో రాష్ట్రంలో మొత్తం వరి ధాన్యం ఉత్పత్తి 36 లక్షల టన్నులయితే 2021-2022లో 1.30 కోట్ల టన్నులకు పెరిగిందన్నారు. ప్రతి గ్రామంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ఫ్లెక్సీల్లో ప్రదర్శించాలన్నారు. నియోజకవర్గాల్లో 9 ఏళ్లగా అభివృద్ధి వివరాలు అందరికీ చేరేలా ప్రజాప్రతినిధులు అధికారులు కృషి చేయాలన్నారు.

పండుగలా నిర్వహించాలి..

రాష్ట్ర దశాబ్ది వేడుకలను పండగలా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. బాన్సువాడలో అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు దినోత్సవం రోజున రైతు వేదికల్లో వేడుకలు జరగాలని, జూన్ 8న ఊరురా చెరువుల పండుగ సందర్భంగా గ్రామాల్లోని చెరువుల దగ్గర బతుకమ్మ, బోనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కట్ట మైశమ్మ పూజ, భోజనాలు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. సురక్షా దివస్, తెలంగాణ రన్ నిర్వహించాలని అన్నారు. జూన్ 9న సంక్షేమ సంబురాల సందర్భంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రెండవ విడత గొర్రెల పంపిణీ, బీసీ కులవృత్తుల పై ఆర్థిక సాయంపై నివేదిక అందాక లబ్ధిదారులను ఎంపిక చేసి జూన్ 9న ప్రారంభించాలన్నారు. వైద్యారోగ్య శాఖ దినోత్సవం రోజు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేస్తామన్నారు. ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల అటవీశాఖ అధికారులు నిఖిత, వికాస్, జిల్లా రైతుబంధు సమన్వయ సమితి అధ్యక్షులు అంజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులున్నారు.

ప్రగతి చాటేలా వేడుకలుండాలి


కామారెడ్డి టౌన్ : పల్లెప్రగతి ఘనత చాటేలా దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మంగళవారం వీసీలో జిల్లాధికారులతో మాట్లాడారు. ప్రతిఒక్క కార్యక్రమంలో అధికారులు సిబ్బంది భాగస్వాములు కావాలన్నారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే మాట్లాడుతూ జిల్లా నుంచి ఇద్దరు ఉత్తమ జీపీ కార్మికులను ఎంపిక చేసి పంపుతామన్నారు. వీసీలో డీపీవో శ్రీనివాసరావు, అదనపు డీఆర్డీవో మురళీకృష్ణ, జెడ్పీ సీఈవో సాయ గౌడ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

విచారణతో వేటు పడేనా..!

- ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల్లో అక్రమాలపై నేడు ఆర్డీవో విచారణ
- విద్యార్థుల నుంచి రూ. 2 కోట్లకు పైగా వసూలు చేశారని ఆరోపణలు
- అక్రమాలు నిరూపితమైతే 11 మందిపై వేటుపడే అవకాశం
- విద్యార్థి జేఏసీ ఆందోళనలు, 'సాక్షి' కథనాలు సాక్ష్యాలుగా ఎంక్వైరీ



విద్యాశాఖ మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు(ఫైల్)

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి జిల్లాలో గతనెలలో జరిగిన ఓపెన్ ఇంటర్, టెన్త్ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై విద్యార్థులు సంఘాలు ఆందోళనలు చేయడం.. 'సాక్షి'లో వరుస కథనాలు కూడా ప్రచురితం కావడంతో నేడు ఆర్డీవో ఈ విషయంపై విచారణ చేపట్టనున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గతనెలలో జరిగిన ఓపెన్ ఇంటర్, టెన్త్, పరీక్షల్లో విద్యార్థుల నుంచి రూ. 2 కోట్లకు పైగా వసూళ్లు చేశారని ఆరోపణలొచ్చాయి. దీనిపై విద్యార్థి సంఘాలు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి ఫిర్యాదు చేయడంతో విచారణ కమిటీ వేశారు. పరీక్షల రోజున దేవునిపల్లి, హరిజనవాడ ప్రభుత్వ స్కూల్ సెంటర్‌లో స్వయంగా రాష్ట్ర అబ్జర్వర్ తనిఖీల్లో మాస్ కాపీయింగ్, ఒకరికి బదులు మరొకరు పరీక్షలు రాయడం బయటపడింది. ఈ సందర్భంగా 11 మందిపై పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. ఈ అక్రమాల్లో జిల్లా అధికారులతో పాటు పరీక్షల నిర్వహణ అధికారులు, జిల్లా కో-ఆర్డినేటర్, సీఎస్, డీవో, ఇన్విజిలేటర్లు భాగస్వాములు ఉన్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ పరీక్షల్లో 2 వేలకు పైగా విద్యార్థులు పరీక్షలు రాయగా ఒక్కో విద్యార్థి నుంచి రూ. 10 వేల నుంచి రూ. 20 వేలు వసూలు చేసారని తెలిసింది. స్వయంగా విద్యార్థులే యూపీఐ ద్వారా ఆన్‌లైన్ లావాదేవీలు జరిపినట్లు తెలిసింది. మరి కొందరు సెంటర్‌ల వద్ద డబ్బులు వసూలు చేశారు. వీడియోలు కూడా సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి.

కమిటీ నివేదిక నేడు సమర్పణ..

కామారెడ్డి ఆర్డీవో శ్రీనివాస్ ముందు నేడు ఈ అక్రమాలపై ఉదయం 11 గంటలకు విచారణ జరుగనుంది. స్వయంగా ఆర్డీవోతోనే విచారణ జరుపుతారు. విద్యాశాఖ మంత్రి ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి, సదాశివనగర్ ఎంఈవోలు విచారణ కమిటీ సభ్యులుగా ఉండి విచారణ చేశారు. వీరిద్దరు కూడా నామమాత్రం విచారణ చేశారని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. వీరి విచారణ నివేదిక నేడు ఆర్డీవో ముందుకు రానుంది. వీరు విచారణ చేయకుంటే సంజాయిషీ కూడా ఇవ్వాల్సి ఉంటుంది. కామారెడ్డి ఎంఈవోతో పాటు, పరీక్షా కేంద్రాల జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ స్కూల్ సీఎస్‌లు ఇద్దరు, ఎస్సీవాడ జెడ్పీహెచ్ఎస్ సీఎస్, డీవో ఇద్దరు, జిల్లా కో ఆర్డినేటర్ ఒకరు, జెడ్పీహెచ్ఎస్ ఎస్సీవాడ ఇన్విజిలేటర్లు ముగ్గురు, జెడ్పీహెచ్ఎస్ (బాలుర) సీఎస్, దేవునిపల్లి జెడ్పీహెచ్ఎస్ డీవోలు, ఇన్విజిలేటర్లు నేడు ఆర్డీవో ఎదుట హాజరుకావాల్సి ఉంది. వీరితో పాటు విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు ఆర్డీవో లేఖలు పంపారు.


నిగ్గుతేలితే..

విద్యార్థుల నుంచి రూ. 2 కోట్లకు పైగా వసూలు చేసినట్లు సాక్ష్యాలున్నాయి. సోషల్ మీడియాలో వీడియోలు, విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ నగదు బదిలీల ఆధారాలు కూడా ఉన్నాయి. ఈ అక్రమాలు బయటకు రాకుండా విద్యాశాఖ అధికారులు అన్ని ప్రయత్నాలు చేశారు. కొందరు అధికారులు కొందరు విద్యార్థి సంఘాల నాయకులకు రూ. లక్షన్నరకు పైగా డబ్బులిచ్చి నోళ్లు మూయించినట్లు సమాచారం. అయితే ఆయా అక్రమాలపై 'సాక్షి' ఆది నుంచి కథనాలు ప్రచురించింది. ఈ కథనాలు ప్రస్తుతం సాక్ష్యాలుగా నిలిచాయి. డబ్బులిచ్చిన కొందరు విద్యార్థులు సైతం సాక్షితో మాట్లాడుతూ తమ గోడు వెల్లబోసుకున్నారు. నేడు విచారణ నిజాలు నిగ్గుతేలితే సుమారు 11 మందిపై వేటు పడనుంది.

'జలవిద్యుత్'కు మెరుగులు

- నిజాంసాగర్ ప్రాజెక్ట్ జల విద్యుత్ కేంద్రానికి రూ. 12 కోట్లతో మరమ్మతులు
- ఆటోమెటిక్ సిస్టం ఏర్పాటు

నిజాంసాగర్(జుక్కల్) : ఉమ్మడి రాష్ట్రంలో మొట్టమొదటి హైడ్రో ఎలక్ట్రిసిటీ పవర్ జనరేషన్ జల విద్యుదుత్పత్తి కేంద్రం పునరుద్ధరణ పనులకు నోచుకుంటుంది. నిజాంసాగర్ ప్రాజెక్టుకు అనుసంధానంగా నిజాంసాగర్ మండలం హెడ్‌స్లూయిస్ వద్ద 1954లో జల విద్యుదుత్పత్తి కేంద్రాన్ని నిర్మించారు. 15 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉన్న మూడు టర్బయిన్లను ఏర్పాటు చేశారు. ఇంగ్లాండ్ నుంచి తీసుకొచ్చిన టర్బయిన్లు ఇప్పటివరకు మరమ్మతులకు నోచుకోలేదు. మూడవ టర్బయిన్ మాత్రం 1974లో మొరాయించడంతో మూలనపడింది. అప్పటినుంచి హెడ్‌స్లూయిస్ జల విద్యుదుత్పత్తి కేంద్రంలోని రెండు టర్బయిన్ల ద్వారా విద్యుదుత్పత్తి జరుగుతోంది.



టర్బయిన్ల వద్ద జరుగుతున్న మరమ్మతులు

ఈ ఏడాది విద్యుదుత్పత్తికి బ్రేక్..

జల విద్యుదుత్పత్తిని మ్యానువల్ పద్ధతిలో కాకుండా ఆటోమెటిక్ విధానంలో విద్యుత్ ఉత్పత్తి జరిగేలా పనులు చేపడుతున్నారు. జల విద్యుదుత్పత్తి కేంద్రం సుందరీకరణ పనులు చేపడుతుండటంతో ఈ ఏడాదిలో జల విద్యుదుత్పత్తికి బ్రేకులు పడ్డాయి. టర్బయిన్లను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేందుకు యంత్రాలను తొలగించడంతో ఈ వర్షాకాలంలో విద్యుదుత్పత్తి జరగదు.

మూణ్నెళ్ల క్రితం నుంచి..

హెడ్‌స్లూయిస్ జల విద్యుదుత్పత్తి కేంద్రం ఆధునికీకరణ ప్రభుత్వం రూ. 12 కోట్లను ఏడాది క్రితం మంజూరు చేసింది. కాని టెండర్ ప్రక్రియ ఆలస్యం కావడంతో పనులు ప్రారంభం కాలేదు. మూణ్నెళ్ల క్రితం ఢిల్లీకి చెందిన కాంట్రాక్టర్‌కు టెండర్ ద్వారా పనులు అలాట్ కాగా మూణ్నెళ్ల నుంచి పనులు ప్రారంభించారు. సుమారు 8 నెలల పాటు కొనసాగుతున్నాయి. జల విద్యుదుత్పత్తి కేంద్రం మార్పుల్లో భాగంగా కాలం చెల్లిన వైర్లు, పరికరాల తొలగింపుతో పాటు టర్బయిన్లకు తుదిమెరుగులు దిద్దనున్నారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్ ఎం ఏడీ రవీందర్ మాట్లాడుతూ వర్షాకాలం పూర్తయ్యేనాటికి ఆధునికీకరణ పనులు పూర్తి చేస్తామన్నారు.

క్లుప్తంగా

మంత్రి, ఎమ్మెల్సీకి ఆర్పీల వినతి



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా ఆర్పీ(రీసోర్స్ పర్సన్)ల వైస్ ప్రెసిడెంట్ ధోండి స్వర్ణలత ఆధ్వర్యంలో మంగళవారం కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలి శారు. ఆర్పీలకు డ్రెస్‌కోడ్, జీవో మార్పిడి, పీఆర్‌సీ, ప్రమాదబీమా వర్తించేలా చూడాలని వినతిపత్రం అందజేశారు.

రోడ్డెక్కిన అన్నదాత



మాచారెడ్డి: రైస్ మిల్ సిబ్బంది తాము తెచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు రోడ్డెక్కారు. భవానిపేట శివారులో భూలక్ష్మీ రైస్ మిల్ వద్ద కామారెడ్డి– సిరిసిల్ల రహదారిపై వడ్ల ట్రాక్టర్లతో రైతులు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. నాలుగు రోజులుగా ట్రాక్టర్లు, లారీల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో ఎండకు ఎండుతూ..వానకు తడుస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై సంతోష్ కుమార్ ఘటనా స్థలానికి వెళ్లి రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. వినకపోవడంతో కామారెడ్డి ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడించారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



మద్నూర్(జుక్కల్): మహిళల ఆరోగ్యంపై వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్ సూచించారు. డోంగ్లీ పీహెచ్‌సీలో మంగళవారం ఆరోగ్య మహిళ కార్యక్రమం సందర్భంగా ఆయన ఆస్పత్రిని సందర్శించారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మహిళలు ఉపయోగించుకోవాలని సూచించారు. ఎనిమిది రకాల రోగాల నిర్ధారణ, చికిత్స, అవసరాన్ని బట్టి రెఫరల్ సేవలు అందిస్తామన్నారు. వైద్యులు రీతుపటేల్ పాల్గొన్నారు.

నిర్మించారు.. వదిలేశారు

- ప్రారంభానికి నోచుకోని రూర్బన్ అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే, ఎంపీ మధ్య కుదరని సయోధ్య
- నిరుపయోగంగా ఉంటున్న భవనాలు



నిరుపయోగంగా ఆడిటోరియం



ప్రారంభానికి నోచుకోని మినీ స్టేడియం

ఎడపల్లి: రాజకీయంగా ఎన్ని విబేధాలు ఉన్నా అభివృద్ధిలో కలిసి నడవాల్సిన ప్రజాప్రతినిధులు తలోదారిలో వెళ్తున్నారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి నిధులతో నిర్మించిన భవనాలు ఏడాదిగా ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా మారాయి. ఎడపల్లి మండలాన్ని డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ రూర్బన్ ప్రాజెక్ట్ మిషన్‌లో ఎంపిక చేశారు. రూ.వంద కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వ వాటా 30 శాతం, రాష్ట్ర ప్రభుత్వ వాటా 70 శాతంగా నిర్ణయించారు. చేపట్టే ప్రతి అభివృద్ధి పనిలో 30– 70 శాతం నిష్పత్తిలో నిధులు కేటాయించాలి. దీని ప్రకారంగా మొదటి విడతగా రూ.30 కోట్ల మంజూరు చేశారు.

ఏళ్లు గడుస్తున్నా..

మండలంలోని అనేక గ్రామాల్లో ఈ పథకంలో భాగంగా పలు నిర్మాణాలు చేపట్టారు. ఎడపల్లి మండల కేంద్రంలో మినీ స్టేడియం, ఆడిటోరియం, జైతాపూర్‌లో పశువైద్యశాల భవనం నిర్మించారు. ఈ నిర్మాణాలు పూర్తయి దాదాపు రెండేళ్లు గడుస్తుంది. వీటిని ప్రారంభిస్తే ప్రజలకు ఉపయోగపడతాయి. పనులను ఎంపీ, ఎమ్మెల్యే సంయుక్తంగా ప్రారంభించారు. నిర్మాణం జరిగినా అనంతరం కూడా ప్రోటోకాల్ ప్రకారం ఎంపీ, ఎమ్మెల్యేలు ఇద్దరు హాజరై వివిధ నిర్మాణాలను ప్రారంభించి వాటిని ప్రజలకు అందుబాటులోకి తేవాల్సి ఉంది. కానీ రాజకీయ విభేదాల కారణంగా ఎంపీ ఎమ్మెల్యేలు కలిసి ప్రారంభోత్సవాలకు వచ్చే అవకాశాలు గత రెండేళ్లుగా కనిపించడం లేదు. దీంతో ఆయా భవనాలు ప్రారంభించకుండానే పాతబడిపోయి వాటి ఆలనా పాలనా లేక బూజు పట్టిపోతున్నాయి.

కలెక్టరే చొరవ చూపాలి

మండలంలో రూర్బన్ మిషన్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన వివిధ నిర్మాణాల ప్రారంభోత్సవాలపై కలెక్టరే చొరవ చూపాలని మండల ప్రజలు కోరుతున్నారు. రాజకీయ విభేదాలు పక్కన పెట్టి ప్రజాప్రతినిధులు ఆయా భవనాలను అందుబాటులోకి తెచ్చేలా కృషి చేయాలని వేడుకుంటున్నారు.

మూడేళ్లలో పూర్తి చేయాలి

రూర్బన్ ప్రాజెక్టులో చేపట్టిన పనులు మూడేళ్లలో పూర్తి కావాలి. అలా అయితేనే రెండో విడత మరిన్ని నిధులను మంజూరు చేసుకునే అవకాశం ఉంటుంది. ఇలా మరో రూ. 70 కోట్లు మండలానికి వచ్చే అవకాశం ఉంటుంది. మొదటి విడతలో చేపట్టిన పనులు పూర్తి కావడానికి నిర్ణయించిన గడువు కంటే ఎక్కువ రోజులు అయింది. మరో రూ.రెండు నుంచి రూ.మూడు కోట్ల విలువైన పనులు పూర్తి కావాల్సి ఉంది. అలీ సాగర్ ఉద్యానవనంలో టూరిజం శాఖ ద్వారా కోటిన్నర రూపాయల వ్యయంతో చేపట్టాల్సిన పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. నిధులు ఇవ్వడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సిద్ధంగా ఉన్న పనులు పూర్తి చేయించుకోవడంలో అధికారులు, నేతలు వెనుకబడి ఉన్నారు. మొదటి విడతగా వచ్చిన నిధులతో అష్ట కష్టాలకోర్చి వివిధ అంశాలను మార్పులు చేర్పులు చేసి 30 కోట్ల నిధుల పనులు పూర్తి చేయడానికి సంవత్సరానికి బదులు మూడు సంవత్సరాలు సమయం తీసుకున్నారు.

మళ్లీ దంచికొట్టిన వాన



రెంజర్ల కొనగోలు కేంద్రంలో తడిసిపోయిన ధాన్యం బస్తాలు

బాల్కొండ: జిల్లాలోని పలుచోట్ల ఆదివారం రాత్రి బలమైన ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయి. రోడ్లపై ఆరబెట్టి బస్తాల్లో నింపిన ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. సజ్జలు వర్షపు నీటిపాలయ్యాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవడంతో బస్తాలను తిప్పి ఆరబెట్టడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

కొందరికి మోదం..

ఆదివారం అర్ధరాత్రి తర్వాత కురిసిన భారీ వర్షం వలన ధాన్యం రైతులు అవస్థలు పడగా.. మరికొందరు రైతులకు మేలు చేసింది. ముందస్తుగా వానాకాలం పంటలు సాగుచేసే రైతులకు ఈ వర్షం ఊరటనిచ్చింది. కొన్ని గ్రామాల్లో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండడంతో పసుపు, మక్క పంటలను జోరుగా సాగు చేస్తున్నారు.

13.2 మిల్లీమీటర్ల వర్షపాతం

సుభాష్‌నగర్: జిల్లాలో సోమవారం అర్ధరాత్రి పలు మండలాల్లో అకాల వర్షాలు కురిశాయి. సగటున

మండలాలు	వర్షపాతం	కమ్మర్‌పల్లి	24.6
బాల్కొండ	32.2	ఆర్మూర్	31.1
మెండోరా	31.8	భీమ్‌గల్	22.8
నందిపేట	22.4	వేల్పూర్	24.5
ఏర్గట్ల	24.8	డిచ్‌పల్లి	21.6
మోర్తాడ్	25.9	వర్ని	14.7
మాక్లూర్	13.4	నిజామాబాద్ నార్త్	5.5
జక్రాన్‌పల్లి	26.8	ఇందల్వాయి	8.3
ముప్కాల్	26.8	ధర్పల్లి	14.5

13.2 మిల్లీమీటర్లుగా వర్షపాతం నమోదైంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో పలుచోట్ల ధాన్యం తడిసిపోయింది. అత్యధికంగా బాల్కొండలో 32.2 మిల్లీమీటర్లు, మెండోరాలో 31.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రానున్న రెండు రోజుల పాటు కూడా అకాల వర్షాలు నమోదయ్యే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

శానిటేషన్‌లో ఇష్టారాజ్యం

- ఇద్దరు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ల బదిలీ
- మరో ఇద్దరికి ఏళ్ల తరబడిగా ఒకే దగ్గర పోస్టింగ్
- నిజామాబాద్ బల్దియాలో కొరవడిన పర్యవేక్షణ

నిజామాబాద్‌నాగారం: మున్సిపాలిటీలో శానిటేషన్ విభాగం పూర్తిగా గాడి తప్పుతోంది. ఇష్టారాజ్యంగా బదిలీల ప్రక్రియ చేపడుతున్నారు. నచ్చిన వారిని నచ్చిన చోటుకు బదిలీ చేస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లపై బదిలీ వేటు వేశారు. మరో ఇద్దరిని తాజాగా బదిలీ చేశారు. ఇంకో ఇద్దరు మాత్రం ఏళ్ల తరబడిగా ఒకే జోన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. నగరంలో ఆరు జోన్ కార్యాలయాలున్నాయి. ఆయా జోన్‌లకు శానిటేషన్ ఇన్‌స్పెటక్టర్లు ఉన్నారు. ఒక్కో జోన్ పరిధిలో సుమారుగా 230కి పైగా కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. మొత్తం 1400వందల వరకు కార్మికులున్నారు. నగరంలో ఉన్న 60 డివిజన్‌లకు సంబంధించి ఆయా జోన్‌లకు ప్రత్యేకంగా డివిజన్లు, కాలనీలు కేటాయించారు. వాటి పరిధిలో శానిటేషన్ పరంగా సమస్యలు పరిష్కారించాల్సి ఉంటుంది.

నాలుగు నెలల క్రితం ఇద్దరు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేశారు. జోన్ 4ఎ(రాజీవ్ గాంధీ ఆడిటోరియం)లో విధులు నిర్వహిస్తున్న నటరాజ్‌గౌడ్‌ను గోల్‌హనుమాన్‌కు, జోన్–2 గోల్‌హనుమాన్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రశాంత్ జోన్–4ఎకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. కలెక్టరేట్ పరిశుభ్రంగా ఉండడం లేదంటూ జోన్–1(నాందేవాడ)లో విధులు నిర్వహిస్తున్న సునీల్‌ను, జోన్–4బి(కంఠేశ్వర్)కి బదిలీ చేశారు. అక్కడ ఉన్న ప్రభుదాస్‌ను జోన్–1కు బదిలీ చేశారు. ఏళ్ల తరబడిగా ఒకే దగ్గర విధులు నిర్వహిస్తున్న జోన్–3, జోన్–5(అర్సపల్లి) ఇన్‌స్పెక్టర్లు మాత్రం బదిలీ కాలేదు. వారం రోజులనుంచి జోన్–5లో శానిటేషన్ జవాన్ వెంకటస్వామి అసభ్య పదజాలంతో దూషించారని, ఇందుకు ఎస్సై మహిపాల్ మద్దతు ఇస్తున్నారంటు కార్మికులు, డ్రైవర్లు డీఆర్‌సీ కేంద్రం ఎదుట నిరసన తెలిపిన విషయం తెలిసిందే. వీరిపై ఎంహెచ్‌వో, కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లినా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

పర్యవేక్షణ గాలికి

శానిటేషన్ విభాగం అంతా ఇన్‌చార్జి పాలనతో నడుస్తోంది. నగరంలో ఉన్న ఆరు జోన్‌లకు ఇన్‌చార్జి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లే ఉన్నారు. అతి ముఖ్యమైన ఎమ్‌హెచ్‌ఓ పోస్టు ఏడాదిన్నరకు పైగా ఇన్‌చార్జితోనే నెట్టుకొస్తున్నారు. దీంతో శానిటేషన్ అస్తవ్యస్థంగా మారుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదు.

తెయూపై మంత్రి, ఎమ్మెల్సీ స్పందించాలి

- పీసీసీ కార్యదర్శి గడుగు గంగాధర్



మాట్లాడుతున్న పీసీసీ కార్యదర్శి గంగాధర్

ఖలీల్‌వాడి: తెలంగాణ యూనివర్సిటీలో జరుగుతున్న రిజిస్ట్రార్ వివాదంపై మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత స్పందించకపోవడంతోనే రగడ కొనసాగుతుందని పీసీసీ కార్యదర్శి గడుగు గంగాధర్ అన్నారు. మంగళవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్‌ఆర్ హయాంలో జిల్లాలో బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల కోసం ఈ యూనివర్సిటీ ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం యూనివర్సిటీ రిజిస్ట్రార్ పదవి కోసం రెండుగా చీల్చిందన్నారు. ఈసీ ఒక రిజిస్ట్రార్‌ను, వీసీ మరొక రిజిస్ట్రార్ నామినేట్ చేయడంతో విద్యార్థులు గందరగోళ పరిస్థితి నెలకొందన్నారు. టీయూలో విద్యార్థులు, ఆధ్యాపకులు రెండు వర్గాలుగా చీలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్సిటీలో ఇంత తతంగం జరిగిన మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ కవిత స్పందించకపోవడం శోచనీయమన్నారు. జిల్లా పోలీస్ కమిషనర్ రిటైర్ అయి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు కొత్త సీపీని నియమించకపోవడం ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి నిదర్శమన్నారు. మంత్రికి, ఎమ్మెల్సీ కవితకి మధ్య సమన్వయం లేకపోవడంతోనే సీపీ నియామకం కాలేదని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశ వేణు, జావేద్ అక్రమ్, రాజనరేందర్, తాహెర్ బిన్ హందాన్, ఎజాజ్, అజీజ్ అన్సారీ, ఈసా, రేవతి, మలైకాబేగం, పద్మ పాల్గొన్నారు.

రేపు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు

నిజామాబాద్‌నాగారం: పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 1న ఉదయం 10 గంటలకు జిల్లా బాలభవన్‌లో పర్యావరణ పరిరక్షణ అంశాలపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం ఇంజినీర్ లక్ష్మణ్‌ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పోటీల్లో గెలిచిన విజేతలకు జూన్ 5న పర్యావరణ దినోత్సవం నాడు బాలభవన్‌లో జరిగే కార్యక్రమంలో కలెక్టర్ బహుమతులు అందజేస్తారని పేర్కొన్నారు.

వీసీ రాజీనామా చేయాలి

- విద్యార్థి సంఘాల డిమాండ్
- వీసీ చాంబర్ ముట్టడి



వీసీ టేబుల్‌పైకి ఎక్కి నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు



బయటకు తీసుకెళ్తున్న పోలీసులు

తెయూ(డిచ్‌పల్లి): అవినీతి, అక్రమాలకు పాల్పడిన తెలంగాణ యూనివర్సిటీ వీసీ రవీందర్‌గుప్తా తన పదవికి రాజీనామా చేసి వెళ్లిపోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వీసీ రవీందర్ క్యాంపస్‌కు వచ్చిన సమాచారం తెలుసుకున్న పీడీఎస్‌యూ, ఎన్‌ఎస్‌యూ, బీవీఎం విద్యార్థి సంఘాల నాయకులు పరిపాలనా భవనంలోని వీసీ ఛాంబర్‌ను ముట్టడించారు. వీసీపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తుండటాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. వీసీ టేబుల్ పైకి ఎక్కి నినాదాలు చేశారు. ఇన్‌చార్జి సీఐ ప్రతాప్ ఆధ్వర్యంలో ఎస్సైలు గణేష్, నరేష్ సిబ్బందితో కలిసి విద్యార్థి నాయకులను ఛాంబర్ నుంచి బలవంతంగా బయటకు లాక్కెళ్లారు. దీంతో వారు వీసీ చాంబర్ బయట బైఠాయించి ఆందోళన కొనసాగించారు. విద్యార్థి సంఘాల నాయకులు జన్నారపు రాజేశ్వర్, వేణురాజ్, బీవీఎం విఠల్ మాట్లాడారు. విద్యార్థులు ఫీజుల రూపంలో చెల్లించిన డబ్బులను పాలకమండలి అనుమతి లేకుండానే వీసీ విచ్చలవిడిగా ఖర్చు చేసి ఖజానా ఖాళీ చేశారని ఆరోపించారు. అక్రమ నియామకాలు, పదోన్నతులు చేపట్టారన్నారు. చివరకు ఉద్యోగుల వేతనాలు చెల్లించడానికి కూడా కమిషన్ తీసుకున్నారని ఆరోపించారు. అటు ఈసీ ఇటు వీసీ వేర్వేరుగా రిజిస్ట్రార్లను నియమించడంతో యూనివర్సిటీకి అసలు రిజిస్ట్రార్ ఎవరో తెలియక విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి యూనివర్సిటీకి రిజిస్ట్రార్ ఎవరనేది వెంటనే తేల్చాలని, వీసీని బర్తరఫ్ చేసి ఆయన అవినీతిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సుమారు మూడు గంటల పాటు విద్యార్థుల ఆందోళన కొనసాగింది. విద్యార్థి నాయకులు సంతోష్, స్నేహిత, లక్ష్మీనారాయణ, మోహన్, సైమన్ పాల్, నిఖిల్‌రెడ్డి, సయ్యద్ అహ్మద్, సందీప్‌రెడ్డి, శివ, రమణ, లక్కీ, ఉదయ్, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

వీసీ వాహనం అడ్డగింత..

మధ్యాహ్నం 2 గంటలకు భోజనం చేయడానికి వీసీ రవీందర్ తన ఛాంబర్ నుంచి బయటకు వచ్చి వాహనం ఎక్కగానే అక్కడే ఉన్న విద్యార్థి నాయకులు అడ్డుకున్నారు. పోలీసులు వారిని పక్కకు లాగాలని చూసినా పట్టువీడలేదు. దీంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చివరకు వీసీ కొద్ది దూరం నడుచుకుంటూ వెళ్లారు. ఇంతలో పోలీసులు తమ వాహనంలో వీసీని అక్కడి నుంచి తీసుకెళ్లారు.

తల్లి చేపల వేట షురూ!



తల్లిచేపను పరిశీలిస్తున్న మత్స్య అభివృద్ధి అధికారి

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ జాతీయ చేప పిల్లల కేంద్రంలో చేపపిల్లల ఉత్పత్తి ప్రక్రియ కోసం కావల్సిన తల్లి చేపల వేటను చెరువుల్లో ప్రారంభించారు. రెండు రోజుల నుంచి వివిధ గ్రామాల్లోని చెరువుల నుంచి తల్లిచేపలను వేటాడి ఆక్సిజన్ సాయంతో ఉత్పత్తి కేంద్రానికి తరలిస్తున్నారు. చెరువుల్లో పెరిగిన నాణ్యమైన మేలు జాతి చేపలను ఎంపిక చేస్తారు. కనీసం రెండు కిలోలకు తగ్గకుండ ఉన్న చేపలను వేటాడుతారు. తల్లి చేపలను కేంద్రంలోని మట్టి పాండ్లలో వదులుతారు. చేపలు సహజంగా గుడ్లను జూలై, ఆగస్టు నెలల్లో వదులుతాయి. మెండోరా మండలం బుస్సాపూర్, చాకీర్యాల్, ముప్కాల్ మండలం నల్లూర్, రెంజర్ల, కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్, బాల్కొండ, జలాల్‌పూర్, నందిపేట్ మండలం దత్తాపూర్, కుద్వాన్‌పూర్, వన్నెల్(కే) చెరువుల నుంచి తల్లి చేపల సేకరణ కొనసాగిస్తామని మత్స్య శాఖ అభివృద్ధి అధికారి డోలిసింగ్ తెలిపారు. రెండు టన్నుల తల్లి చేపలు అవసరముంటాయని ఆయన తెలిపారు. మరోవైపు వేసవి ముగుస్తున్నా చెరువులు నిండుకుండలా ఉండటంతో తల్లి చేపలు లభించడం కష్టమవుతుందని ఫీల్డ్‌మెన్‌లు అంటున్నారు.

ప్రమాదకరంగా స్తంభాల తరలింపు





సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నగరంలోని ఆర్మూర్ వెళ్లే ప్రధాన రహదారిలో భారీ సిమెంట్ విద్యుత్ స్తంభాలను అజాగ్రత్తగా ట్రాక్టర్‌పై రవాణా చేస్తున్నారు. వెనుక వైపునకు జారేలా ట్రాక్టర్‌లో పెట్టి వాటిని ఎక్కడ కూడా తాళ్లతో కట్టలేదు. దీంతో దీని వెనుక వెళ్లేందుకు వాహనదారులు భయపడ్డారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



ప్రేమ్‌కుమార్ (ఫైల్)

మాక్లూర్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని మదన్‌పల్లి శివారులో జరిగింది. మాక్లూర్ ఎస్సై యాదగిరిగౌడ్ కథనం మేరకు.. అమ్రాద్ గ్రామానికి చెందిన గిరెడ్డి ప్రేమ్‌కుమార్ (18) తన తల్లి విజయ, సోదరిని బైక్‌పై ఎక్కించుకొని అమ్మమ్మ గ్రామం డిచ్‌పల్లి మండలం రాంపూర్‌కు బయలు దేరాడు. మదన్‌పల్లి శివారులో లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ప్రేమ్‌కుమార్ తలకు బలమైన గాయంకాగా, తల్లి విజయ, సోదరికి స్వల్ప గాయాలు అయ్యాయి. వీరి ముగ్గురిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే ప్రేమ్‌కుమార్ మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. తల్లి, సోదరి చికిత్స పొందుతున్నారని వెల్లడించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

మిత్రుడి మృతికి కారణమైన వ్యక్తికి జైలు

ఖలీల్‌వాడి: స్నేహితుడి మృతికి కారణమైన వ్యక్తికి ఏడేళ్ల కఠిన కారాగార జైలు శిక్ష విధిస్తూ నిజామాబాద్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల మంగళవారం తీర్పు చెప్పారు. వివరాలు.. నిజామాబాద్ నగరంలోని బర్కత్‌పురాకు చెందిన కరీమ్ లాలా, ఆటో నగర్‌కు చెందిన షేక్ అక్బర్ స్నేహితులు. అక్బర్, కరీమ్ దగ్గర రూ.12వేల అప్పు తీసుకున్నాడు. 2020 ఫిబ్రవరి 6న ఇద్దరు మద్యం తాగారు. ఈ క్రమంలో కరీమ్ తన డబ్బుల గురించి అడిగాడు. డబ్బులు ఏమి ఇచ్చేది లేదని అక్బర్ అనడంతో మద్యం మత్తులో ఉన్న కరీమ్ కట్టెతో అక్బర్ తలపై బలంగా కొట్టాడు. తీవ్రంగా గాయపడ్డ ఆయన మృతి చెందాడు. ముద్దాయిపై నేరారోపణలు రుజువు కావడంతో కరీమ్‌లాలాకు ఏడేళ్ల కఠిన జైలుశిక్షతో పాటు రూ.రెండు వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా మూడు నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవిరాజ్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

చికిత్స పొందుతూ పలువురి మృతి

మోపాల్: మండలంలోని మంచిప్పకు చెందిన వడ్డె చిన్న నర్సయ్య (37) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై మహేష్ మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. చిన్న నర్సయ్య కొన్నేళ్ల క్రితమే మతిస్థిమితం కోల్పోయాడు. ఈనెల 28న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఆయన భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

మోపాల్‌కు చెందిన వృద్ధురాలు..

మోపాల్‌కు చెందిన జంగం పర్వవ్వ (70) మనోవేదనతో ఆరోగ్యం క్షీణించి మంగళవారం మృతిచెందినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. పర్వవ్వ కొడుకు రాజేశ్వర్, కోడలు లావణ్య ఆస్తి విషయంలో తరచూ గొడవ పడుతూ ఆమెను కొడుతుండేవారు. సోమవారం కూడా గొడవ జరిగింది. అప్పటికే మనోవేదనతో పర్వవ్వ ఆరోగ్యం మరింత క్షీణించింది. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. తన తల్లిని కొడుకు, కోడలు కొట్టడం వల్లే ఆరోగ్యం క్షీణించి మృతిచెందిందని పర్వవ్వ కూతురు విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసశామని ఎస్సై తెలిపారు.

అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన యువకుడు..

సదాశివనగర్: మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై తోట రాజేశ్ తెలిపారు. గ్రామానికి చెందిన నామాల మనోజ్(27) డీజిల్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. బైక్ ఈఎంఐ కట్టడానికి తండ్రి గంగాధర్‌ను డబ్బులు అడిగాడు. దీంతో తండ్రి మందలించాడు. మనస్తాపం చెందిన మనోజ్ ఈ నెల 25న రాత్రి ఎలుకల మందు తాగాడు.

గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు సూచించడంతో నిజామాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి



బాబురావు(ఫైల్)

ఇందల్వాయి: మండలంలోని గండితండా గ్రామ పంచాయతీకి చెందిన పాల్త్య బాబురావు(44) పొలం వద్ద విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. వివరాలు.. బాబురావు తన పొలం వద్ద విద్యుత్ వైర్లు బిగించేందుకు సబ్‌స్టేషన్ నుంచి ఎల్‌సీ తీసుకున్నాడు. వైర్లు బిగిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా జరిగి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఇదిలా ఉండగా బాబురావు ఎల్‌సీ రిటర్న్ చేయకుండానే అధికారులు విద్యుత్ సరఫరా చేశారని తండావాసులు ఆరోపించారు. ఈ విషయంపై అధికారులను వివరణ కోరగా బాబురావు ఫోన్‌చేసి ఎల్‌సీ రిటర్న్ చేస్తున్నట్లు చెప్పాకే విద్యుత్ సరఫరా చేశామన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాబురావు అన్న కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వడదెబ్బతో గుర్తు తెలియని వ్యక్తి ..

జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండలో గుర్తు తెలియని వ్యక్తి వడదెబ్బతో మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. గ్రామ శివారులోని పెద్దమ్మ గుడి సమీపంలోని తోటలో ఒక వ్యక్తి మరణించి ఉండడాన్ని గ్రామస్తులు గమనించారన్నారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారని తెలిపారు. దీంతో ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించామన్నారు. సదరు వ్యక్తి మూడు రోజులుగా గ్రామంలో తిరుగుతూ కనిపించాడని గ్రామస్తులు తెలిపారన్నారు. మృతదేహాన్ని పరిశీలించి వడదెబ్బతో వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించామన్నారు.

ధాన్యం లారీ బోల్తా



ఎల్లారెడ్డి: మండలంలోని అన్నాసాగర్ గ్రామ శివారులో బాన్సువాడ– ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై మంగళవారం ధాన్యం లారీ బోల్తా పడింది. నిజాంసాగర్ మండలంలోని తుంకిపల్లి గ్రామం నుంచి ధాన్యం బస్తాలను లోడ్ చేసుకుని కామారెడ్డికి వెళ్తుండగా లారీ బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. డ్రైవర్ మద్యం తాగి వాహనం నడపడంతోనే ప్రమాదం జరిగినట్లు రైతులు చెప్పారు.